

మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైన పీఎస్ఆర్, మైక్రోలింక్ సంస్థల ప్రతినిధులు

## పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ 500 కోట్ల పెట్టుబడి

### రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ర్టానికి చెందిన పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ భారీ పెట్టుబడులు పెట్టుబోతున్నది. ఎలక్ట్రానిక్, ఐటీతోపాటు ఇతర ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి రూ.500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అమెరికా టెలికం దిగ్గజం మైక్రోలింక్ నెట్‌వర్క్స్ నుంచి సాంకేతిక పరిజ్ఞానం అందుకోవడానికి ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులతో పాటు పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావుతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పీఎస్ఆర్ సంస్థ ఏర్పాటు చేయనున్న పరిశ్రమలతో వచ్చే మూడేండ్లకాలంలో 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా పర్యటనలోభాగంగా మైక్రోలింక్ నెట్‌వర్క్స్ యాజమాన్యం, పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని, ఇరు సంస్థల సాంకేతిక బదిలీకి అంగీకరించాయని పేర్కొన్నారు.

## ఇండ్లకు తగ్గిన గిరాకీ

### ప్రాప్‌టైగర్ తాజా నివేదికలో వెల్లడి

**ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో 14 శాతం క్షీణత**

న్యూఢిల్లీ, జూలై 11: హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు పడిపోయాయి. ప్రముఖ ప్రాపర్టీ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్ తాజా నివేదికలో హౌజింగ్ సేల్స్ క్షీణించినట్టు తేలింది. దేశవ్యాప్తంగా హైదరాబాద్‌సహా 8 ప్రధాన నగరాల్లో ఉన్న హౌజింగ్ డిమాండ్, సప్లైలపై ప్రాప్‌టైగర్.. తమ త్రైమాసిక గణాంకాలను విడుదల చేసింది. ఇందులో ఈ ఏడాది జనవరి-మార్చితో పోల్చితే ఏప్రిల్-జూన్‌లో ఓవరాల్‌గా గృహ విక్రయాలు 6 శాతం పతనమైనట్టు చెప్పింది. అయితే అహ్మదాబాద్ తర్వాత హైదరాబాద్‌లోనే గిరాకీ ఎక్కువగా పడిపోయినట్టు స్పష్టం చేయడం గమనార్హం.

**ఇదీ సంగతీ..**

ఈ జనవరి-మార్చిలో హైదరాబాద్ గృహ విక్రయాలు 14,298 యూనిట్లుగా ఉన్నాయి. అయితే ఏప్రిల్-జూన్‌లో 12,296 యూనిట్లకే పరిమితమయ్యాయి. 2 వేలకుపైగా హౌజ్ సేల్స్ తగ్గాయి. దీంతో 14 శాతం క్షీణత నమోదైంది. గతంతో చూస్తే మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చిన కొత్త ఇండ్ల సంఖ్య కూడా పడిపోయినట్టు తేటతెల్లమైంది. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిల్డర్లు, ఇన్వెస్టర్లు వేచిచూసే ధోరణిని అవలంబించడం వల్లే ఇదంతా అని ప్రాప్‌టైగర్ చెప్తున్నది. కానీ రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులే వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయని లోకల్ టాక్. పాలనాపరమైన అంశాల్లో ప్రభుత్వం నత్త నడకన సాగుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మిగతా నగరాల్లో..**

బెంగళూరులో అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు 30 శాతం పెరిగాయి. జనవరి-మార్చిలో 10,381 యూనిట్లు అమ్ముడైతే.. ఏప్రిల్-జూన్‌లో 13,495 యూనిట్ల సేల్స్ నమోదయ్యాయి. ఢిల్లీ-ఎన్సీఆర్ (గురుగ్రామ్, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్)లోనూ 10 శాతం పుంజుకొని 11,065 యూనిట్లకు చేరాయి. అంతకుముందు 10,058 యూనిట్లే. ఇక అహ్మదాబాద్‌లో 26 శాతం తగ్గి 9,500 యూనిట్ల అమ్మకాలే జరిగాయి. మునుపు 12,915 యూనిట్ల సేల్స్ ఉన్నాయి. చెన్నైలో 10 శాతం, ముంబై ఎంఆర్ (ముంబై, నవీ ముంబై, థానె)లో 8 శాతం, పుణెలో 5 శాతం చొప్పున హౌజింగ్ సేల్స్ తగ్గాయి. కోల్‌కతాలోనూ 16 శాతం ఇండ్ల అమ్మకాలు దిగజారాయి. మొత్తంగా ఈ 8 నగరాల్లో ఏప్రిల్-జూన్ ఇండ్ల అమ్మకాలు 1,13,768 యూనిట్లుగా ఉన్నాయి. జనవరి-మార్చిలో 1,20,642 యూనిట్లుగా ఉన్నాయని ప్రాప్‌టైగర్ తెలియజేసింది.





## బీవైడీ నుంచి నయా ఈవీలు

**సింగిల్ చార్జింగ్‌తో 521 కి.మీ.**

న్యూఢిల్లీ, జూలై 11: చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్‌లోకి ఒకేసారి మూడు ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేసింది. ఆట్టో 3 ఈవీల్లో భాగంగా డైనమిక్, ప్రీమియం, సూపీరియర్ వెర్షన్లలో ఈ మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో డైనమిక్ రకం రూ.24.99 లక్షలు కాగా, సూపీరియర్ రూ.33.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ కార్ల కోసం ముందస్తుగా రూ.50 వేలు చెల్లించి బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటిలో 49.92 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన డైనమిక్ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 468 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 60.48 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ప్రీమియం, సూపీరియర్ మాడళ్లు సింగిల్ చార్జింగ్‌తో 521 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

## 'బ్యాంక్ గ్యారెంటీని మినహాయించండి'

### టెలికం శాఖకు వొడాఫోన్ ఐడియా మొర

న్యూఢిల్లీ, జూలై 11: వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ బకాయి కోసం పెట్టిన రూ.24,747 కోట్ల బ్యాంక్ గారెంటీని రద్దు చేయాలని టెలికం శాఖను వొడాఫోన్ ఐడియా కోరినట్టు సమాచారం. ఇప్పటికే పీకల్లోతు అప్పుల్లో ఈ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ కూరుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇంత భారం తమపై మోపవద్దని టెలికం శాఖ వద్ద వొడాఫోన్ ఐడియా మొర పెట్టుకున్నట్టు పీటీఐకి సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. కాగా, స్పెక్ట్రమ్ వేలం నిబంధనల ప్రకారం గడువు తేదీకి ఏడాది ముందే చెల్లించాల్సిన మొత్తాన్ని బ్యాంక్ గ్యారెంటీగా డిపాజిట్ చేయాల్సి ఉన్నది. ఇటీవలి వేలంలో వొడాఫోన్ ఐడియా స్పెక్ట్రమ్ కొన్న విషయం తెలిసిందే.

## విశాఖ ప్రైవేటీకరణ ఆలోచన లేదు

- కార్మికులు ఆందోళన చెందొద్దు
- కేంద్రమంత్రి కుమారస్వామి

హైదరాబాద్,జూలై 11 (నమస్తే తెలంగాణ): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రానికి లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి స్పష్టం చేశారు. ఈ ప్లాంట్‌పై అనేక మంది ఆధారపడి ఉన్నారని చెప్పారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజులతో కలిసి గురువారం వైజాగ్‌లోని స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తమ బాధ్యతని, ప్లాంట్‌లోని అన్ని విభాగాలను పరిశీలించామని, ప్రధాని ఆశీస్సులతో ప్లాంట్ వందశాతం సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తనకు 2 నెలలు సమయమివ్వాలని, ప్రధాన మంత్రికి పూర్తిస్థాయి నివేదిక ఇచ్చిన తర్వాత ఆయన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. కార్మికులకు ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతకుముందు ప్లాంట్‌లో కార్మిక సంఘా లు, ఉద్యోగ సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## హైబ్రిడ్‌పై పన్ను సంగతేంటి?

### కార్లపై యూపీలో రోడ్ ట్యాక్స్ రద్దు

**లక్షల్లో తగ్గుతుండటంతో తెలంగాణ వాహనదారుల్లో ఆసక్తి**

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఉత్తరప్రదేశ్ (యూపీ) తరహాలో తెలంగాణలోనూ హైబ్రిడ్ కార్లపై రోడ్ ట్యాక్స్‌ను మినహాయించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. దీనివల్ల ఒక్కో కారు ఆన్‌రోడ్ ధర సుమారు రూ.2 నుంచి 3 లక్షలదాకా తగ్గే అవకాశం ఉండటంతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారు. ఇక కొందరైతే యూపీ వెళ్లి కారు కొనేందుకూ ఆసక్తి చూపుతున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.10 లక్షలు ఖర్చయ్యే వాహనాలకు రోడ్ ట్యాక్స్ 12 శాతంగా ఉన్నది. ఆపై ధర పలికితే 14 శాతం వసూలు చేస్తున్నారు. మారుతీ సుజుకీ, టయోటా వంటి కంపెనీలు కొన్ని హైబ్రిడ్ మాడల్ కార్లను విక్రయిస్తున్నాయి. వీటి ధరలు రూ.10 లక్షలపైనే ఉండటంతో రోడ్ ట్యాక్స్ రూ.2-3 లక్షల వరకు ఉంటున్నది. కాగా, బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ మోటర్‌తో పాటు పెట్రోల్ లేదా డీజిల్ ఇంజిన్‌ల ద్వారా నడిచే అవకాశం ఉండటం ఈ హైబ్రిడ్ కార్ల ప్రత్యేకత. దీనివల్ల మైలేజీ ఎక్కువగా ఉండటమేగాక, కాలుష్యం కూడా తక్కువగా ఉంటున్నది. అందుకే యూపీ సర్కారు ఈ నెల 1 నుంచి హైబ్రిడ్ కార్లపై రోడ్ ట్యాక్స్‌ను తొలగించింది. దీంతో అక్కడ హైబ్రిడ్ కార్ల విక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. దేశ రాజధాని నగరం ఢిల్లీకి దగ్గరగా ఉన్న గ్రేటర్ నోయిడాలోనైతే నెలనెలా పెద్ద ఎత్తున అమ్మకాలు నమోదవుతున్నాయి. గతంతో పోల్చితే ఇప్పుడు హైబ్రిడ్ కార్ల రిజిస్ట్రేషన్లు 50 శాతానికి పెరిగినట్టు వాహన పరిశ్రమ ప్రతినిధులూ చెప్తున్నారు.



**ఈవీ విక్రయాల్లో..**

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయ్యే తొలి 5,000 విద్యుత్తు ఆధారిత (ఈవీ) కార్లకు రిజిస్ట్రేషన్ చార్జీల నుంచి మినహాయింపునిచ్చారు. కానీ ఈ సంఖ్య ఎప్పుడో దాటిపోయింది. దీంతో ఇప్పుడు ఎలక్ట్రిక్ కార్లకూ మామూలుగానే రిజిస్ట్రేషన్ చార్జీలను వసూలు చేస్తున్నారు. అయితే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ఈవీల రిజిస్ట్రేషన్‌పై పన్ను మినహాయింపు ఉండటంతో చాలామంది అక్కడ కార్లను కొనుగోలు చేస్తున్నట్టు ఆటో ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణలోనూ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లపై రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిగా మినహాయించాలని కోరుతున్నారు. దీనివల్ల కాలుష్యం గణనీయంగా తగ్గడమేగాక, వాహన విక్రయాలూ పెరుగుతాయంటున్నారు. మరి దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

## టీసీఎస్ లాభం 12,040 కోట్లు

**తొలి త్రైమాసికంలో 9 శాతం వృద్ధి • రూ.10 మధ్యంతర డివిడెండ్ ప్రకటన**

ముంబై, జూలై 11: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.12,040 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,074 కోట్ల కంటే ఇది 8.7 శాతం అధికం. అలాగే మార్చి త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 3.1 శాతం తగ్గింది. ఆదాయం మాత్రం ఏడాది ప్రాతిపదికన 5.4 శాతం ఎగబాకి రూ.62,613 కోట్లకు చేరుకున్నది. గడిచిన త్రైమాసికంలో ఉద్యోగుల వేతనాలు పెంచడంతో కంపెనీ ఆర్థిక వనరులపై ప్రభావం చూపిందని సీఎఫ్‌వో సమీర్ తెలిపారు.

- భారత్‌తోపాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు రెండంకెల వృద్ధి నమోదైంది.
- సంస్థకు వచ్చిన ఆదాయంలో తయారీ రంగం 9.4 శాతం వృద్ధిని కనబరచగా, ఎనర్జీ-యుటిలిటీ 5.7 శాతం, లైఫ్ లైన్సె, హెల్త్‌కేర్ 4 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.
- గత త్రైమాసికంలో కొత్తగా 5,452 మంది ఉద్యోగులు చేరడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. వీరిలో 35.5 శాతం మహిళా ఉద్యోగులు కావడం విశేషం.
- సంస్థలో ప్రస్తుతం ఉద్యోగుల వలసలు రేషియో 12.1 శాతంగా ఉన్నది.
- రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.
- ప్రస్తుతం కంపెనీ వద్ద రూ.11,168 కోట్ల విలువైన నగదు నిల్వలు ఉన్నాయి.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు 13,249 మంది తగ్గారు. గడిచిన 19 ఏండ్లలో ఇలా తగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం.

*నూతన ఆర్థిక సంవత్సరం లాభాలతో ప్రారంభించాం. ఇండస్ట్రీ, మార్కెట్ల పరంగా ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరిచాం. క్లయింట్లతో ఉన్న సంబంధాలను కొనసాగించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఫ్రాన్స్, అమెరికాల్లో ల్యాబ్‌లు, లాటిన్ అమెరికా, కెనడా, యూరప్‌లలో ప్రత్యేకంగా డెలివరి సెంటర్లను ఏర్పాటు చేశాం.*

**- కే కృతివాసన్, టీసీఎస్ సీఈవో, ఎండీ**

